# బంగారం వజ్రం

## పోల్కంపల్లి శాంతాదేవి

"నాకు చదువుకోవాలని ఉంది." వంకో చిస్తూ, బెరుగ్గానే అంది కోమలం.

పండువెన్నెల్లో ఆహ్లాదంగా విహరిస్తున్నవాడు అకస్మాత్తుగా కారుమేఘం పీడ వరుచుకొన్నట్లుగా ఉలికిపడి వింతగా అడిగాడు రామగోపాల్ : "ఏమిటీ?"

విస్మయంగా వినిపించిన అతని స్వరంతో ఇంచుక అవహేళన కూడా ఉందేమో వనిపించి అతడికేసి చూపులు త్రిప్పింది కోమలం, ముఖం చిన్నబుచ్చుకొని.

మ్లానంగా మారిపోయిన నవవధువు ముఖ భంగిమలు గుర్తించి, తనలోని ఆశ్చర్యాన్ని సంబాళించుకొని, చిరునవ్వు ముఖంమీద పులుముకొని, సౌమ్యంగా అడిగాడు "చదువుకొంటావా?"

"ఊఁ." చూపులు అవనతం చేసి అంది: "బాగా చదువుకొని విద్యాధికురాలిని కావాలన్న కోరిక నాలో తీవ్రంగా ఉంది. అమ్మా, నాన్న కాదన్నారు. ఆడపిల్లకు పెళ్ళే ముఖ్యమన్నారు. చదువుకొంటానని ఎంతగా వేధించినా చివరికి వారి పంతమే నెగ్గించుకొన్నారు. ఇహ నా కోరిక తీరాలంటే ఒకటే దారి - చదువుకు అనుమతి మిమ్మల్ని అడగడం.

"పెళ్ళి చూపులనాడు దుఃఖంతో, ఉక్రోషంతో నిండిపోయిన నా ముఖం - ఏ మాత్రం సూక్ష్మదృష్టి ఉన్నా గుర్తించే వారు మీరు. అయితే, నే నెంత విసుగ్గా చూచినా ఆ తొలిచూపులోనే మీరు సౌమ్య హృదయులని తోచింది నా మనస్సుకు. అప్పుడే ఆశ చిగురించింది - చదువుకోవాలన్న నా కోరిక మన్నిస్తారని. "ఎందాక చదివా"రని మీరు ఎంతో కుతూహలంగా అడిగారు కూడా. చదువుకొన్న భార్య కావాలన్న మీ కోరిక అవగతంకాగా నా చదువుకు అభ్యంతరం చెప్పరని కూడా ఆశించాను. మీ సంస్కారం విషయంలో అపనమ్మకం ఇంచుక లేకుండా పై చదువు గురించి కలలు కన్నాను."

గుటకలు మ్రింగుతూ కూర్చొన్నాడు రామగోపాల్. పెళ్ళి చూపులనాడు మామగారు - "అమ్మాయి స్కూల్ ఫైనల్ ఫస్టుక్లాసులో - ఈ ఊరికే ఫస్టు వచ్చింది. పై చదువులకు పోవాలని దాని బలవంతం ఉందనుకోండి. కాని, ఎంత తెలివైన ఆడపిల్ల అయినా ఈడొచ్చిన ఆడకూతురికి ముఖ్యంగా తలిదండ్రులు చూడవలసింది వివాహమే కదా? ఎంత చదివినా యిది తప్పేదికాదు. అనవసరమైన ఖర్చూ, డొంక తిరుగుడూ దేనికని పెళ్ళి చేసెయ్యాలనే మా సంకల్పం" అని చెప్పాడు.

తెలివైన పిల్ల భార్య కాబోతున్నందుకు గర్వించాడు రామగోపాల్. చదువుకొన్న భార్య కావాలనుకొన్నది నిజమే. అయితే డిగ్రీలు పుచ్చుకొన్నదనికాదు; కాస్తముక్క చదువుకోవడం కాక [అది తన తండ్రి తాతలనాటి కోరిక] దినపత్రికలు, వారపత్రికలు చదివి ప్రపంచం పోకడలు అర్థం చేసుకోగలిగి ఉండాలని మాత్రమే. దానికి స్కూల్ ఫైనలు చాలు.

ఆ మాట ఆ పిల్లతో ఎలా చెప్పాలి? మనసు నొచ్చుకుంటుందేమొ! ఆదిలోనే హంసపాదులాగ అనురాగమయం కావలసిన తమ దాంపత్య జీవనంలో మనస్పర్ధనూ, వైషమ్యాన్ని రేకెత్తిస్తుందేమో! స్త్రీ విద్యను హర్షించని కుసంస్కారిగా తలుస్తుందేమో! స్త్రీ అభ్యుదయం కోరని దురహంకారిగా భావిస్తుందేమో!

మూడుముళ్ళతో ఒక బంధంలోకి ఇద్దరిని చేర్చడం బ్రాహ్మడికీ. పెద్దలకూ సులభమేందేకాని ఆలూ మగలు ఒక ముడిలోకి రావాలంటే ఆ ఇద్దరిలో ఎంతటి సౌహృదయం కావాలి. వైవాహిక జీవితం సుఖవంతం కావాలంటే చాలా సున్నితంగా నడుచుకోవలసిన సమయమిది. ఈ సమయంలో ఆ పిల్లకు తనపై దురభిప్రాయం కలిగిందా ఆ ముద్ర అలాగే పడిపోయే ముందు తమ దాంపత్య జీవనం కలుషితం కాక తప్పదు.

తన సంస్కారంతో, సహృదయతతో ఆ పిల్ల చదువుకోవాలన్న కోరిక ముడిపెట్టి ఫలితం కోసం నిరీక్షిస్తూ కూర్చోవడం చిరాకు కలిగించింది రామగోపాల్‌కు. చదువుకోడానికి అనుమతి ఇవ్వడంతో అయిపోతుందా? మూడు నిద్రలు అయిపోతూనే భార్యను తనతో తీసుకుపోవాలని చక్కని ఇల్లుకూడా చూచివచ్చాడు, తను ఉద్యోగం చేస్తూన్న ఊళ్ళో. కోమల చదువుకోడానికి ఉమెన్స్ కాలేజి ఉందక్కడ. కాని.... కోమల కాలేజి యువతి అయి పుస్తకాలు పుచ్చుకొని ఉదయం లేచి పరుగెత్తుతూంటే, కోపులలో గృహిణి గురించి తను కన్న కలలు ఏం కావాలి? హోటల్ భోజనంతో విసు

గెత్తిపోయి, ఒంటరితనంతో వేగిపోయి - హాయిగా వండిపెట్టే తోడునీడ కాగల సహచరికోసం తపించిన తను కోమల కోరిక మన్నిస్తే – ఏం కావాలి తను కనిన కలలగతి? ఇది తన స్వార్థభావం? జమ కట్టితే అదెంతవరకు న్యాయం? ఈ వయసులో ప్రతి మగవాడికీ ఉండే సహజమైన కోరిక అది.

ఈ మాట పెళ్ళి చూపులనాడు అడిగితే బాగుండేది నువ్వు. నువ్వు అడగలేకపోతే మీ వాళ్ళద్వారా అడిగించవలసింది" అన్నాడు, ఎటూ తేల్చి చెప్పలేక.

ఒక క్షణం అనుమానంగా చూచి, నెమ్మదిగా అంది కోమల, ఇంచుక అనురాగం మేళవించిన కంఠంతో: "అప్పుడు నా వారుకాదు. ఏ అధికారంతో మిమ్మల్ని కోరమంటారు?.... ఇప్పుడు మీ నుండి ఏది పొందడానికైనా నాకు సంపూర్ణాధికారం ఉంది."

"ఇష్టా ఇష్టాలను అధికారంలో బంధించడం మూర్ఖం" అనబోయి తమాయించుకొన్నాడు. తన ఆంతర్యం బయటపడి ఆమె మనసు నొచ్చుకొంటుందన్న బెదురుతో- "అదికాదు. నా ఇష్టం కనుక్కోడానికి అధికారంతో పనేముందిప్పుడు?" చిరునవ్వు తెచ్చి పెట్టుకొని అన్నాడు,

"అయితే మీ కిష్టంకాదా, నేను చదువుకోవడం?" దెబ్బతిన్నట్టుగా అంది.

ఆ ప్రశ్నకు సూటిగా నిలబడడానికి ధైర్యం చాల్లేదు రామగోపాల్‌కు. భార్య చదువుకొని డిగ్రీ తెచ్చుకొన్నదైతే పురుషుడికి గర్వకారణమే. కాని, యిప్పుడామె చదువుకోడానికి ఎలా వీలవుతుంది? కోమలనే తను పెళ్ళాడదలచి, పెళ్ళికిముందు ఆమె కోరిక వెల్లడైతే, ఆమె చదువు పూర్తయ్యేదాకా తను నిలిచేవాడు. కానీ, ఇప్పుడది అసాధ్యం.

మనసులోని మాట ఖచ్చితంగా చెప్పివేయలేక, ప్రస్తుతానికి ఆమెను సభ్యపెట్టి నేర్పుగా నింద తనమీదికి రాకుండా తప్పించుకోవాలనుకొన్నాడు రామగోపాల్. తమముందు దాంపత్యసుఖం రుచిచూస్తే యిక విద్యగురించి విముఖత ఏర్పడిపోవచ్చు!

కోమల జడలో విచ్చుకొన్న మల్లెల పరిమళమూ, వెలిగించిన అగరువత్తుల పరిమళమూ మనసులో మధురమైన ఊహల రేకెత్తించి మత్తెక్కిస్తూంటే ఉద్వేగంతో ఆమెను కౌగిటిలోకి తీసుకొన్నాడు. "చూద్దాంలే."

"—లే అంటే కాదు. మీ కిష్టమో- కాదో చెప్పాలి."

"అలాగే చదువుకొందువుగానిలే."

"అయితే నా చదువు పూరికాని య్యండి. అప్పటిదాకా మీకూ నాకూ ఈ దూరం తప్పదు." మృదువుగా అతడి కౌగిటినుండి విడివడి గజం దూరంపోయి నిలబడింది.

"హాయ్! యిప్పుడేం ఎత్తువేయాలి?" పెదవి కొరుక్కున్నాడు. ఉపాయంతోచక చిరాకు కలిగింది. "చదువూ లేదు గిదువూలేదు పొమ్మంటే? ఉహుం. మృదువుగా నచ్చజెప్పితే దారికి వస్తుందేమో!"

"మన దాంపత్య జీవితం నీ చదువుకేం ఆటంకం కాబోదు. నువ్వు చదువుకోడానికి నేను యిష్టపడ్డానుగా?" అన్నాడు లాలనగా,

తీవ్రంగా తలాడించింది. "ఉహుం. అలా వీల్లేదు. పిల్లలూ....తరువాత సంసారం.... యిహ ఎలా చదవగలను? నా ఆశయం అర్థం చేసుకొని సహకరించే పక్షంలో మీరు ఈ షరతును కూడా అంగీకరించాలి."

చిలిపిగా అందామనుకొన్నాడు గాని. కొంచెం కటువుగానే ధ్వనించాయేమో రామగోపాల్ మాటలు: "....అంగీకరించని పక్షంలో?"

హాస్యానికి అన్నట్టుగా అన్నా కళ్ళలో నీళ్ళు సుళ్లు తిరిగాయి కోమలకు, ఆ మాటే తను సహించలేనట్టుగా. "....ఏదో కోల్పోయినట్టుగా, అమూల్యమైనది పొందలేనట్టుగా అశాంతి నా జీవితాన్ని వేగిస్తుంది. అసంతృప్తితో నిండిపోతుంది జీవితం."

"జీవితంలో మధుర స్మృతిగా నిలిచిపోవలసిన ఈ తొలిరాత్రి ఇంత అసహ్యంగా తయారైందేమిటి?" మధనపడ్డాడు. "ఎలా ఆమెకు నచ్చజెప్పాలి! బలాత్కారంగా లొంగదీసుకొంటే! పశువుగా భావిస్తుందేమో!"

ఒక్కరాత్రితో అయిపోయేదికాదు తమ దాంపత్యం. ఎన్నేళ్ళో పెనవేసుకు సాగవలసిన జీవితాలు ఈ రెండు. అదిలోనే భేదాభిప్రాయాలు మనసులో జొరబడి చెరో దారి కాకూడదు. మహా అంటే రెండేళ్ళు మూడేళ్ళు....ఆ తరువాతయినా కోమల దాంపత్య జీవితానికి స్వాగతం పలకకపోదు. ముందు జీవితాలు ఆనందప్రదం కావాలంటే తనిప్పుడు నిగ్రహించుకోక తప్పదు. ప్రస్తుతం కోమల కోరిక అసందర్భంగా కనిపించినా ఈ కాలంలో ప్రతి ఆడపిల్లా కోరే కోరికే అది!

● ● ●

"కోమల యిక్కడే ఉండి చదువుకొంటుంది."

రమణమ్మ ఆశ్చర్యపోయింది, కొడుకు మాటకు. "నీతో తీసుకు పోవడంలేదూ? ఇప్పుడు చదువేమిటి?"

ఎలా చెప్పాలో పాలుపోలేదు రామగోపాల్‌కు. కోమల కోరింది కాబట్టి అంటే-ఆ అమ్మాయిని కోప్పడుతుందేమో అమ్మ. నీకు కాపురంకంటే చదువు ముఖ్యమా అని!

ముఖంలోకి నవ్వు ఎరువు తెచ్చుకొని "కోడలు డిగ్రీ తెచ్చుకొన్నదైతే నీకు గర్వంకాదే, అమ్మా?" అన్నాడు.

"నా బొంద. ఆడది డిగ్రీ తెచ్చుకొన్నదైతే అంత గొప్పేమిటిరా? కుదురుగా సంసారం నడుపుకొనే తెలివితేటలు కావాలిగాని. ఎదురింటి రామలక్ష్మి కూతుర్ని చూడు. 'పిల్ల చిన్నది. ఇప్పటినుండి కాపురానికి పంపము. ఇక్కడే ఉండి చదువుకొంటుంది కొన్నాళ్ళు' అని, పెళ్ళయ్యాక రెండేళ్ళు ఉంచుకొని బి. ఎ. చదివించారా? అదిప్పుడు ఉద్యోగం చూచుకొని టింగురంగా అంటూ వెళ్ళిపోయింది. మగడొచ్చి కాపురానికి రమ్మంటే వెళ్లనంటూందట! గొప్పగా ఉంటుందని చదివిస్తే వచ్చిన అప్రదిష్ట చూడు!....ఏం, నీ పెళ్లాం చదివి

ఉద్యోగం చేయాలనా? అది ఉద్యోగం చేయకపోతే నీ సంసారం గడ్వెక్కదనా? నెలకు అయిదు వందలు తెచ్చుకొంటున్న హోదా ఉద్యోగమే."

"తను ఉద్యోగం చేయాలని కాదు. కాలం మారిపోయింది కదా? ఇప్పుడు చదువుకొన్న ఆడదానికున్న గౌరవం వంటింటి కుందేలుగా బ్రతికే మనిషి లేదు. సమాజంలో గౌరవ ప్రతిపత్తులు సాధించాలంటే సంసారం కుదురుగా నడుపుకోడమే కాదు. ఆధునిక యువతి విద్యా వివేకాలు వికసింప జేసుకోక తప్పదు. ఆలోచించే, కోమలను చదువుకొమ్మని చెప్పను. పదహారేళ్ళేగా? బాగా చదువుకొనే వయస్సే యిది." తనకు అయిష్టమైనా కోమల కోరిక సమర్థిస్తూ మాట్లాడక తప్పలేదు.

"చదివించు, నాయనా! రాజ్యలక్ష్మి కూతురిలా తయారైతే వేగవలసింది నువ్వే కదా?" విరసవ వ్యక్తంచేసి వెళ్ళిపోయింది రమణమ్మ.

వక్కగదిలోనే ఉంది కోమల, అత్తగారి మాటలు వింటూ.

నెమ్మదిగా నడిచివచ్చి మంచంమీద వాలాడు రామగోపాల్.

కృతజ్ఞతగా, సంతృప్తికూడిన చిరునవ్వు పెదవులమీద నర్తిస్తూంటే అంది కోమల "మీ రెంతో మంచివారు. సంస్కార పూరితులు. మీ అమ్మగారితో దెబ్బలాడి నా కోరిక సమర్థిస్తున్నారు."

"అక్కడా మా అమ్మా, నాన్నమ్మా ఇలాంటి కుశంకలతోనే చదువుసాగనివ్వారుకాదు. పెళ్ళి కావలసిన దాన్ననీ, బయట తిరగనిస్తే చెడిపోతాననీ- చెడిపోక పోయినా చెడిపోయినట్టు లోకం అపవాదు లేవదీస్తుందని పట్టుబట్టి పెళ్ళి చేసేశారు. అదృష్టవశాత్తు మీరు నా కోరిక మన్నించే సహృదయు లయ్యారుగాని లేకపోతే త్రిశంకు స్వర్గమయ్యేది నా జీవితం"

"మొండితనంతో కోరిక నెగ్గించుకోవడమే జీవితానికి సంతృప్తి అనుకొంటున్నావు, కోమలా! కాదు. అది ఎదుటివ్యక్తి శాంతి సంతోషాలను హరిస్తుందని తెలిసిన రోజు నువ్వు నిజంగా దుఃఖపడాలి. కొన్ని స్వార్థత్యాగాలు, బుద్ధిపూర్వకంగా అపూర్వమైనవే పోగొట్టుకొన్నా అదే అమూల్యమైన సంతృప్తి నిస్తుంది మనసుకు!" అనాలనుకొన్నాడుగాని అనలేకపోయాడు, ఆమె తనమీద నిలిపిన గౌరవానికి, నమ్మకానికి విఘాతం కలిగించడం యిష్టంలేక.

. ఎంతటి మూఢుడికైనా బుద్ధి చెప్పగల విజ్ఞతకలవాడు కాలపురుషుడు!

కాలమే మార్పు తెస్తుంది కోమలలో. తను తొందరపడి వెలితిపడితే ఆమె దృష్టిలో కించకావడంతప్ప మరేమీ ప్రయోజనం ఉండబోదు.

"అమ్మ పెద్దది. పాత భావాలు జీర్ణించుకొన్న మనిషి. సర్దుకుపోగల సహృదయత మనలో ఉండాలి. కాకపోతే, మనస్పర్థలూ, అశాంతీ తప్పవు." ఉదాసీనంగా మారిపోయి ఏదో మాగజైను ముఖానికి అడ్డం పెట్టుకొన్నాడు రామగోపాల్.

అతడి స్వరంలో ఏదో గంభీరిమ స్ఫురించి కొద్దిగా కలతపడింది కోమల.

● ● ●

"కోమలా! ఇంకా లేవవేమే? అబ్బాయి వచ్చేవేళ అయింది." ఇది రెండోసారి కోడలిని హెచ్చరించడం, రమణమ్మకు. "లేచి కాస్త ముఖమదీ కడుక్కొని కాస్త మంచి చీర కట్టుకోరాదూ?"

నోట్స్ వ్రాయడంలో వడిహెచ్చిస్తూ, "ఇదిగోనండి. లేస్తున్నాను. కొంచెం అయితే అయిపోతుంది" అన్నది. కాని, కాగితంమీద అన్నితప్పులు దొర్లిపోవడంమొదలయ్యేసరికి పూర్తి చేయకుండానే ఆపివేసింది. పైగా అత్తగారిసణుగుడొకటి! వ్రాయడం పూర్తయ్యేసరికి యింకా పావు గంటయినా పట్టేట్టుంది.

"లే త్వరగా. వాడు వచ్చే వేళకు నువ్విలా ఏడ్డు ముఖంతో ఉంటే ఏం బాగు?"

అత్తగారిది పోరాడే తత్వం కాదుగాని కొడుకూ కోడలూ ముచ్చటగా ఉండాలని ఆవిడ సరదా. అంటే ఆవిడ గొప్ప సహృదయురాలని కాదుగాని కొందరు తల్లులకు అదొక వేడుక.

అత్తగారిని అపార్థం చేసుకొనేదేమోగాని భర్తమాట మనసులో నిలిచివుంది కోమలకు.

పుస్తకాలు అల్మైరాలో సర్ది పెరట్లో కెళ్ళింది కోమల. ముఖం కడుక్కొని ఇవతలికి వచ్చేప్పటికే, హాల్లో కూలీ నెత్తినుండి హోల్డాల్ దింపుతున్నాడు భర్త.

"బాగున్నావా!" చిరునవ్వుతో చూపులతోనే పలకరించాడతడు.

తడిముఖం కొంగుతో తుడుచుకుంటూ తడబాటుగా తన గదిలోకి వెళ్ళిపోయింది కోమల. "ఏం చదువో! గంటనుండీ చెబుతున్నాను- కాస్త ఆ జుట్టు దువ్వుకొని శుభ్రంగా తయారు కమ్మని!" అత్తగారు సణుగుతూంది అవతల.

బట్టలు మార్చి ముఖం కడుక్కొని టీ తాగివచ్చి, పేపరు తీసుకొని వరండాలో ఈజీ చెయిర్‌లో వాలాడు రామగోపాల్. "కోమలతో ఎలా వ్యవహరించాలి?" ఇదీ అతడికి పట్టుకొన్న సమస్య. దూరంగా వెడితే భార్యదగ్గరికి రెక్కలు గట్టుకొని ఎప్పుడు వాలుదామా అన్న తహ తహ. మరి ఆగలేననిపిస్తుంది. చేరువైతే ఆమెను చూచి భయపడతాడు. ఆవిడ మనసులో అలాంటి ఊహలకే తావులేనప్పుడు తనేం రసికత్వం ఒలకబోసినా అది వెకిలివేషమే అవుతుంది. పెళ్ళినాటికీ నేటికీ ఆవిడలో ఏమీ మార్పు వచ్చినట్టు కనిపించదు. తను దూరంగా ఉండి, ఆమెకు చదువుకోడానికి అనుమతి యిచ్చేసినా అంతరాంతరాలలో ఎక్కడో ఆశకొట్టుకులాడుతూంది- ఏ మధురక్షణంలోనో ఆ కన్నెమనసు మొగ్గ విచ్చుకొంటుందేమోనని. చదువు వదిలేసి ఆవిడ తన బాహువులలో బందీ కాగలదని.

చేటలో బియ్యం పోసుకొని గుమ్మంలోకి వచ్చిన రమణమ్మ, "నీ పెళ్ళాం పెరట్లోవుంది" అంది చిరునవ్వుతో, "అంత దూరంనుండి వచ్చావు. ఇంకా వియోగమేనా?"అన్నభావం వ్యక్తంచేస్తూ. కోడలు నీ కోసమే నిరీక్షిస్తూ ఏకాంతంగా పెరట్లో కూర్చొంది- అన్న పరిహాసం కూడా ఉందేమో!

మరో బెదురు పట్టుకొంది రామగోపాల్‌కు. ఆలుమగలమధ్య పొందికునర లేదని తెలిస్తే అమ్మ మండిపడుతుందేమో! ఇప్పటికే కోడలిని తనతో కాపురానికి తీసుకుపోలేదని, ఇక్కడుంచి చదివిస్తున్నాడన్న మంట ఉందికూడా. అసలు, సంగతి తెలిసిపోతే కోమలను చీదరించుకుంటుందేమో! ఆవిడ చదువు మధ్యంతరంగా ఆగిపోవచ్చు. ఆమె చదువు ఆగిపోతే తనకు వచ్చిన బాధేమీ లేదుగాని, కోమల మనసు చిన్నబుచ్చుకొంటే అనురాగ ధాంపత్యంతో పెనవేసుకుపోవలసిన రెండు జీవితాలకు దెబ్బ.

"మంచి సందిగ్ధావస్థలో చిక్కుకొన్నానే!" పేపరు పుచ్చుకొనే లేచాడు రామగోపాల్.

నూతి దగ్గర అరటి చెట్లమధ్య చల్లగా కూర్చొని చదువుకొంటూంది కోమల.

"చదువు బాగా సాగుతూందా?"

"ఊఁ. సాగుతూంది." నెమ్మదిగా తలెత్తుతూ అంది.

"అమ్మకు పనిలో సాయం అవుతున్నావా? బొత్తిగా పుస్తకాల పురుగువయ్యావా?" ముఖంమీద నవ్వు పులుముకొనే భార్య హృదయాన్ని తట్టాడు. నూతి గట్టుమీద ఆమెకు కొద్ది ఎడంగా కూర్చొని.

వింతగా రెప్పలు అల్లార్చి చూచింది మగడి మొగంలోకి.

ఆ చూపుల దారిలో భంగపడిపోతున్న ఆ పిల్ల ఆంతర్యం చదువుకొన్నాడు రామగోపాల్. "ఆధునిక మహిళాలోకం, పనిపాటలు శ్రద్ధగా చేసుకుపోయే స్త్రీని ప్రేమించి గౌరవించడం పురుషుని కుసంస్కారంగా భావిస్తూందికదా? ఎంతసేపు వాళ్ళ చూపు పై చదువులమీద, ఉన్నతోద్యోగాలమీద, సంఘంలో ప్రముఖస్థానం వహించడంలోనూ ప్రసరిస్తూంది. వాళ్ళ ఈ అభిలాషనూ, ఉత్సాహాన్నీ సమర్థించి ప్రోత్సహించడం పురుషుడి సహృదయతగా, సంస్కారంగా చెప్పుకొంటుంది!"

"పనంతా అత్తయ్యే చేసుకుపోతూంటుంది - నాకు కల్పించుకొనే అవకాశం యివ్వకుండానే. అయినా, నాకు మా పుట్టింట్లో కూడా పని అలవాటులేదు."

"కానీ కోడలివి కదా? కాని ఎప్పటికీ అలా బాగుండదు, కోమలా! పెద్దమనిషి అమ్మ చేస్తూంటే చూస్తూ కూర్చోవడం అసహ్యంగా ఉండదూ?" సాధ్యమైనంత మృదుత్వం తెచ్చి పెట్టుకొనే అన్నాడు. "కాలేజీలో చదివితేనేం? నా కోడలు పనిపాటా ఎంత నేర్పుగా చేస్తుందో అనుకొనేట్టు చేయాలి అమ్మను. అసలు, నువ్వు చదువుకొంటున్నావంటే అమ్మకే ఏవో అపోహలున్నాయి. అవి తొలగించాలి నీ నేర్పుతో, ఓర్పుతో."

కళ్ళలో నిండిన నీళ్ళు రెప్పలు అల్లార్చడంతో బుగ్గలమీదికి జారాయి. మౌనం వహించిన హృదయం ఉద్విగ్నతకు లోనుగావడం స్పష్టపడుతూంది అరుణిమదాల్చిన ఆమె ముఖంలో.

ఆమెను సమాధాన పరిచే మాటలు వెదకలేక పేపరు ముఖానికి అడ్డం పెట్టుకున్నాడు రామగోపాల్.

● ● ●

"అప్పుడే లైటు తీసివేశావేం? చదువుకోవూ?" గదిలోకి వచ్చాడు రామగోపాల్. కిటికీలోంచి గదిలోకి ప్రసరిస్తున్న చంద్రకిరణాల వెలుతురులో గోడను ఆనుకుని నిశ్శబ్దంగా నిలబడిన కోమలను చూచి విసుపోయాడు. గబుక్కున లైటువేశాడు. "అమ్మ మనిద్దరినీ ఈ గదిలోకి పంపినందుకా, బాధపడుతున్నట్టున్నావు?"

"........."

"ఏమిటి సాయంత్రం నా మాటకు కోపం వచ్చిందా?.... మాట్లాడవేం?"

"..........."

ఆమెది సున్నిత హృదయమో. అభిమానమో. అర్థంలేని పెంకెతనమో తేల్చుకోలేకపోయాడు రామగోపాల్. "చెప్పు, కోమలా!" మృదువుగా అన్నాడు.

"నేను చదువుకోదలచలేదు. నేను మీతో వస్తాను. తీసికెళ్ళండి."

ఉండి ఉండి హఠాత్తుగా వినిపించిన ఆమె మాటకు ఉత్సాహంగా ఒక్క గంతు వేసింది. అతడి మనసు. కాని, వెంటనే క్రుంగిపోక తప్పలేదు. ఆమె వదనంలో కనిపించిన కటుగంభీరాలకు, ఆమె ఈ నిశ్చయం తనమీద ఏదో ప్రతీకారం తీర్చుకోడానికా అనిపించింది.

"ఎందుకు?"


"కాకపోతే, ఆడదానికి చదువెందుకు? మగాడికింత ఉడకేసి పక్కలో పండితే చాలు. ఆడబ్రతుక్కు అంతకంటే పరమార్థం లేదు."

"ఉక్రోషపడకు." నిదానంగా అన్నాడు "నువ్వు చదువుకుంటానంటే నేను ప్రోత్సాహ మివ్వలేదా? చదువుకుంటూనే కొంచెం తీరిక చేసుకుని అమ్మకు పనిలో సాయం కమ్మని అన్నందుకా ఈ నిష్ఠూరాలు? ఇదంత మంచి పద్ధతికాదు."

"చదువుకోడానికి అవకాశం కలిగించి చాలా సహృదయత చూపారు. చాలా కృతజ్ఞతలు. కాని నే వింక చదువను. ఈ ముష్టి చదువు నా కక్కరలేదు." తీవ్రంగా అంది. "ఏదో చదవడంకాదు. నా చూపెప్పుడూ క్లాసుమీదే. ఇక్కడ ఇంటిపనులు చక్కదిద్దుకొని క్లాస్ తెచ్చుకోవడం సాధ్యమా?"

"సాధ్యం చేసుకోవాలి, మరి. మహిళలు పైకి రావాలని కోరితే సరిపోదు. అన్ని రంగాల్లోనూ ప్రజ్ఞచూపాలి." భార్యను కవ్విస్తూ నవ్వాడు రామగోపాల్. "స్త్రీకి పతి సేవలోనే పరిపూర్ణత సిద్ధిస్తుందన్నమాట ఈ కాలానికి వర్తించదని తెలుసుకదా? గృహకృత్యాలు నేర్పుగా నిర్వహిస్తూ, అటు విద్యార్జన చేస్తూ, ఉన్నతోద్యోగాలను నిర్వహిస్తూ కూడా తీరిక చేసుకొని కళాసేవ, సంఘసేవ చేస్తున్న స్త్రీ లెందరో ఉన్నారు. నవ్య ప్రపంచంలో స్త్రీ గౌరవ వ్యక్తిత్వాలు ఈ పరిధుల్లోనే బంధింపబడ్డాయి."

"నువ్వు చదువుకుంటానంటే తొలుత మనసుకు కష్టంగా తోచినా తరువాత మనస్ఫూర్తిగానే అంగీకరించాను. నువ్వు విద్యావతి అయితే నీ గౌరవం నాది కాదా ఏం? భార్య చదువుకున్నదని నేను గర్వించలేనని, కేవలం నిన్ను సంసారిగానే చూడాలనుకున్నానని అపోహ పడకు."



"హుఁ! నవ్య ప్రపంచంలో స్వార్థం వెర్రితలలు వేసిన పురుషుడి అందమైన కలలు. కేవలం పాదసేవతో సంతృప్తి పడడం లేదన్న మాటనేటి పురుషుడు. ఈ రీతిలో చూస్తే స్త్రీ బ్రతుకు మరీ బంధాలలో చిక్కుకున్నదన్నమాటే. ఇంట్లో అడుగులకు మడుగులొత్తడం ఎలాగా తప్పదు. సామాజికంగా కూడా తన ప్రతిభనూ, వ్యక్తిత్వాన్నీ పురుషుడి ఉన్నతికోసం ధారబోయాలి. ఇంతకంటే బానిసత్వం ఏముంది స్త్రీకి?

భార్య మాటల్లోని ఆక్రోశాన్నీ, కసినీ చూస్తూ మరీ వినోదపడ్డాడు రామగోపాల్. "సంకుచితంగా ఆలోచిస్తే బానిసత్వమే. ఈ రీతిగా ఆలోచించే స్త్రీకి దుఃఖమూ, అశాంతి తప్పవు. తప్పవు. సహృదయంగా చూస్తే అది సహకారం. పాలకు నీళ్ళ తోడులా.

"ఈ రీతి విప్లవం మీలో వస్తే మాలోనూ వస్తుంది. మీరు లేనిదే మాకు ఇల్లెందుకు? సంపాదనెందుకు? మమతలెందుకు? మీ కోసం తపించి వెర్రివాళ్ళం కావటమెందుకు? మీనుండి విడిపోతాం: ఏ రోడ్డుమీదో కాపురం పెడతాం. అప్పటి మీ బ్రతుకు ఇంటిలోనా, వీధిలోనా? స్వాతంత్ర్యాన్నీ కోరే మీ విప్లవం అప్పు డెలాంటిప్రయోజనం సాధిస్తుందో కొంచెం చెబుతావా?

"మమతా? ఉహుఁ. మీ నరాల వేడి చల్లబరుచుకోడానికి స్త్రీ ఒక ఆటబొమ్మ మాత్రమే. ఆ స్వార్థమే లేకపోతే...."

పకాపకా నవ్వేశాడు రామగోపాల్. "పురుషుడొక్కడే కామాంధుడైనట్టు! స్త్రీ శరీరతత్వాన్ని అతిక్రమించిన యోగినేమో! అలా అయితే ఎప్పుడో ప్రకృతి స్తంభించి పోయేది, అమ్మాయ్! సెక్సుకాంక్ష యిద్దరి లోనూ ఉంది. కాని అదేమో, పురుషుడిని నిందితుడిని చేయడం స్త్రీకి వినోదమను కొంటాను. పంచదారలో తీపి ఎంత సహజమో స్త్రీ పురుషుల పరస్పరాకర్షణ అంత సహజం. అయితే స్త్రీ ప్రేమకు ప్రకృతి మాతృత్వపు శిక్ష విధిస్తుంది. ఆ శిక్షే స్త్రీని పురుషుడి నీడలో నిలుపు తూంది. అతడి సాహచర్యంలో గృహిణిగా బంధిస్తోంది. కాదని పోతావా? ఫలితాలు ఎంత వికృతంగా ఉంటాయో చవి చూస్తావు.... ఇలా వాదించుకుంటూ పోతే చాలా విషయాలు తడుముతూ పోవాలి. ఒకచోట ఆగం. నీలో ఆవేశం ఎక్కువను కొంటాను. కాని ఒక్కటి చెబుతున్నాను. స్త్రీ. పురుషుడికన్న ఎందులోమిన్న అయినా ఎంతటి ప్రతిభావంతురాలైనా, ఉన్నత విద్యావతియైనా మరేమైనా. గర్వంలో మిన్న కాకూడదు.

"ఎంతటి విలువైన వజ్రమైనా బంగా రంలో పొదిగితేనే నిండుశోభ!

."పడుకో రాత్రి చాలా అయింది." చాలా నిర్వికారంగా అటు తిరిగి పడు కున్నాడు.

"అబ్బా: ఎంతటి క్రూరుడు!" గాయ పడిన కోమల అనుకొంది ఈర్ష్యగా. ఎంత అమాయకు డనుకున్నాను. తొలి సమావేశంనాటి రాత్రి అతడు తనను చదువు కొమ్మని చెప్పడంతో? భార్య మాటకు విలువనిచ్చే గొప్ప మనిషి అనుకున్నాను. "నిన్ను నాతో కాపురానికి రమ్మనను. అమ్మా వాళ్ళ దగ్గరుండి చదువుకో" — అని అతడంటే ఎంత పసి హృదయమో, మృదుమానసమో అనుకున్నాను. ఉహుఁ. ఎన్నో తెలుసు. తెలియనట్టు నటించి నన్ను అవమానించాడు. స్త్రీ అంటే గుడ్డిగవ్వ విలువలేదు అతడికి!"

పురుషుడు ఆర్జించిన విద్యా విజ్ఞానాలకు, గౌరవ హోదాలకు గర్వించే స్త్రీ — అతడి తెలివితేటలు తనమీద రుద్దబోతే సహించదు. అన్నీ తెలిసిన పురుషుడు ఏమీ తెలియనివాడై తన కొంగులో దాగా నడం కంటే మరి వేరే గొప్పవరం కోరదు ఆమె.

తన్నో మూర్ఖురాలిని చేసి, నొప్పించే మాటలని నిర్లిప్తంగా అటు తిరిగి పడు కున్న రామగోపాల్‌ని చూచి ద్వేషాగ్ని రగుల్చుకుంది మనసులో. "అనునయించక పోయినా కొంచెం సానుభూతి కూడా చూపే అవసరం లేనట్టుగా అటు తిరిగి పడు కున్నాడు. ఛీ! యితడు మనిషా?" పళ్ళు కొరుక్కుంది. "బాగా చదువుకుంటాను. పైకి వస్తాను. ఉద్యోగం చేస్తాను. ఏవరు వజ్రమో, ఏది బంగారమో అప్పుడు తేలుస్తాను. ఆడది లేనిదే బ్రతకలేని మగాడు ఆడదాన్ని అరికాలిక్రింద అణచి పెట్టాలనే ఆలోచన ఎలా సాగుతుందో చూస్తాను." తీవ్రావేశంతో దృఢంగా నిశ్చ యించుకొంటూ క్రింది పెదవి గట్టిగా నొక్కుకుంది కోమల.

● ● ●

"అయితే నీ బిడ్డ కుదురుగా కాపురం చేస్తూన్నట్టేనా, రామలక్ష్మీ?"

"మూడో నెల యిప్పుడు. ఎలాతప్పించు కుంటుంది? .... నిజంగానే, రమణమ్మా! మగణ్ణి వదిలేసి, మగరాయడిలా ఉద్యోగం చేస్తూ ఎక్కడ అపవాదు తెచ్చివేస్తుందో నని భయపడ్డాను. ఆలూ మగలు ఒకటి కావాలని వెయ్యి దేవుళ్ళకు దండం పెట్టాను .... నీ కోడలూ చదువుతూందా? జాగ్రత్తమ్మా. పెంకెతనం చూపనీకు. గడుసు అత్తగారివి కాకపోతే నిన్నూ, నీ కొడుకునూ కాటికపెట్టి గూట్లో కూర్చో బెడుతుంది. పనీపాట చెప్పకుండా గారాబం చేస్తున్నావు!"

"ఆఁ. ఏం గారాబంలే. ఏదో సరదా పడి చదువుతూంది. మన మొహాలకు వెలితి పడ్డం? నెల తప్పిందో పిల్లమీదా, మగడి మీదా ధ్యాస తప్ప చదువుమీద ఎక్క డుంటుంది? అదే మానేస్తుంది."

కాలేజీ నుండి వచ్చిన కోమల ఎదురింటి రామలక్ష్మితో అత్తగారి సంభాషణవింటూ, భుజాన టవలు వేసుకుని ఓరగా వాళ్ళకేసి చూస్తూ బాత్‌రూంకేసి వెళ్ళిపోయింది. "పాపం! అమాయకురాలు అత్తయ్య!" పరిహాస పూర్వకమైన చిరునవ్వు పెదవుల మీద నర్తించింది.

● ● ●

ఈ మధ్యలో రామగోపాల్ వచ్చి వెళ్ళి ఆరుమాసాలు దాటిపోయాయి.

కోమల పరీక్షలు అయిపోయాయి. సెలవులుకూడా వచ్చాయి. సెలవులిచ్చాక కోడలు పుట్టింటికి వెళ్ళి వచ్చిందని. క్లాసుతో పాసైందని తండ్రి వుత్తరం ద్వారా తెలిసింది రామగోపాల్కి. కనీసం.

దానికి ప్రత్యుత్తరం కూడా ఇవ్వకుండావుండి పోయిన అతడికి తల్లి వ్రాయించిన ఉత్తరం చురకలా తగిలింది.

"....కాపురం చేయడానికి పెళ్ళి చేసుకొన్నావా? ఆవిడకు నాతో చేయించడానికి, చదువుకొన్న పెళ్ళాం అనిపించుకోడానికి చేసుకొన్నావా? నీకంత చదువుకొన్న భార్య కావాలనుకుంటే చదువుకున్న అమ్మాయిలు దొరక్కపోయారా? నీ వరసేం నాకు నచ్చలేదు. నీకంత యిష్టమైతే మరెక్కడైనా ఉంచి చదివించుకో. ఆమెను యిక్కడ ఉంచుకోవడం నాకు బాగోలేదు. తక్షణం వచ్చి నీ పెళ్ళాన్ని తీసికెళ్ళు, నాయనా! నాకు భరింపకాదు. మీ సభ్యత చూస్తుంటే మనుమణ్ణో మనుమరాలినో ఆశించడం కూడా అవివేకంగా తోస్తోంది ..."

వచ్చేప్పుడు నిష్ఠూరం చేసి పంపింది రామగోపాల్‌ను, కోమల. వచ్చేప్పుడు కోమలను గదిలోకి పిలిచి చెప్పాడు కొంచెం అమ్మకు పనిలో సాయంగా ఉండమని. "ఈ చదువైపోయాకైనా కాపురం చక్కదిద్దుకొనే నేర్పు కావాలి కదా? యిప్పుడు పెద్దవాళ్ళక్రింద శిక్షణ పొందక పోతే మరెప్పుడు?"

"ఆడది పనికోసమే పుడుతుందనా మీ అభిప్రాయం? ఆడదానికి ఊపుకంటే, వంటకంటే చాలా అమూల్యమైన పనులే బయట వున్నాయి." చురుగ్గా అంది కోమల. "చదువుకొంటాను. ఉద్యోగం చేస్తాను. డబ్బు పారేసి నౌకర్లను పెట్టుకొంటాను. కాకపోయినా మీ సంపాదన నా చేతులు నలగకుండా సుఖపెట్టలేవా?" వ్యంగ్యంగా నవ్వింది.

అభ్యుదయం పేరిట పోరితనానికి బానిస అవుతుంది నేటిస్త్రీ. సామాజికంగా పెత్తనం చెలాయించడమే గొప్ప అనుకునే ఆమె గృహకృత్యాలను నేర్పుగా నిర్వహించుకోవడం గౌరవంగా ఎప్పుడు భావిస్తుంది? యిలాంటి విప్లవభావతులకు ఏదైనా చెప్పపూనుకోవడంకూడా, వారి దృష్టిలోకు సంస్కారంగా భావించబడడం తప్ప మరో ప్రయోజనంలేదు. మౌనం వహించాడు రామగోపాల్. కోమల గర్విష్టి. విప్లవం వికృతరూపం దాల్చి వుంది ఆమెలో. బుద్ధి చెప్పగలదికాలం. తను కాదు.

అంతదాకా తను దూరంగా వుండి పోవడమే మేలనుకొన్న అతడు, తల్లి వుత్తర వ్రాయించేదాక ఊరికి వెళ్ళే ప్రయత్నంలో లేడు.

● ● ●

"సాయంత్రం మాకో— ఆఫీసరు వస్తున్నాడు భార్యతో. నీ చదువుకు అంతరాయమని విసుక్కోక వాళ్ళను ఆహ్వానించి ఆతిధ్యమివ్వాలి. ఏం? ఒక్కగంట. ఎక్కువుండరులే."

"అలాగే."

ఇంటికంటే గుడి పదిలమన్నట్టుగా, అత్తగారి దగ్గరికంటే భర్త దగ్గరే చదువు బాగా సాగుతూంది కోమలకు. ఇంటికి కాలేజీ దగ్గర. అన్ని పనులకు నౌకర్లూ, ఫ్యాన్లూ. అక్కడ అత్తగారు ఏమనుకుంటుందోనన్న చింతయినా ఉండేదిగాని, ఇక్కడ పూర్తిగా నిశ్చింత.

"దేనికైనా స్త్రీ పురుషులు సమానమేనని ఒప్పుకోవడానికిరాకు. ముందుగానే చెబుతున్నాను" సరదాగా నవ్వి అన్నాడు రామగోపాల్. "నాకు వేరే పని లేకపోతే నీకు సాయం వచ్చేవాడినే. కొంచెం శ్రమ అనుకోకుండా యిల్లు నీటుగా సర్దు. మన మంటే ఎలాగో సర్దుకుపోతామనుకో కాని, ఇంటినీ, ఇల్లాలినీ చూడడానికి వాళ్ళు వస్తున్నారు కదా? .... వంటవాడు రోజు రోజుకు మొద్దు మనిషి అయిపోతున్నాడు.. ఆ స్వీట్లు దగ్గరుండి చేయించు."

అంటు నవ్వుతూ, మృదువుగా అర్థిస్తున్నట్టుగా చెప్పకపోతే, "ఇవన్నీ చేయడానికి నే యింటి పనిమనిషినా?" అని ఎగిరి పడేదేమో కోమల కాని, మౌనంగా తలూచింది.

ఆవిడ వదనంలో అప్రసన్న రేఖలేవీ స్ఫురించకపోవడం గమనించి సంతృప్తిగా ఆఫీసుకు వెళ్ళిపోయాడు రామగోపాల్. కోమలను ఇక్కడికి తీసుకువచ్చాక చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాడు అతడు. ఆమెను రెచ్చగొట్టే మాటలేవీ అనడంలేదు. తనతో బెట్టుగా నడుచుకున్నా, ఇంటి విషయాలేవీ ఆమె పట్టించుకోకపోయినా, తన కష్టసుఖాలేవీ ఆమె పరామర్శించక పోయినా అతడు స్నేహంగా సర్దుకు పోతున్నాడు.

చదువులో నిమగ్నమైన కోమల రెండు గంటల తరువాత తడబాటుగా లేచి పుస్తకాలు టేబిల్ మీద ఉంచేసింది. వంటగది కేసి సాగింది. వంటవాడు తువాలుఉండలా చుట్టుకొని తలక్రింద పెట్టుకుని తీరిగ్గా గురక లేస్తున్నాడు.

"భీమాచార్లూ!"

పగటి నిద్రేమో తొందరగానే తేలిపోయింది ఆచారికి. "ఏం కావాలమ్మా?"

"అయ్యగారి స్నేహితులు వస్తున్నారట సాయంత్రం. రెండు స్వీట్లూ, రెండు కారాలూ నీకు తోచినవి చెయ్యి." వంటవాడికి పురమాయించి హాలూ, తరువాతి గదులూ ఒక్కసారి చుట్టి వచ్చిన కోమలకు గుండె ఆగినంత పని అయింది. పైన బూజు. గోడలకు బూజు. బెంచీలక్రింద బూజు. కుర్చీలక్రింద బూజు దుమ్ము. అస్తవ్యస్తంగా వున్న సామాను.

తను కాలేజీ యువతి. అయ్యగారు ఆఫీసరు. ఫ్యాన్లు ఊడ్చినా, సర్దినా పైపైనే. ఎప్పుడైనా ఆదివారాల్లో రామగోపాలే పాత గుడ్డ పుచ్చుకుని దుమ్ము దులుపుకోవడం, గోడలకు తను ఇష్టపడి కొన్న చిత్రాలు గోడలకు అమర్చుకోడం చేసుకునేవాడు. ఈ మధ్య ఆఫీసు పనితో బొత్తిగా తీరిక లేకుండా పోయింది అతడికి.

కొంగు నడుముకు బిగించి కార్యరంగంలోకి దిగింది కోమల. గంటగంటన్నర తరువాతగాని యివతల పడలేదు. అప్పటికి ఆమె అవతారమే మారిపోయింది. ముఖంనిండా, తలనిండా, బూజు. చీరంతా పాడయిపోయింది. "బాబోయ్! వాళ్ళొచ్చే టైం అయింది."

హడావిడిగా బాత్‌రూంకేసి పరుగెత్తింది కోమల.

● ● ●

తల తడి తుడుచుకుంటూ వంటగదిలోకి తొంగిచూచింది కోమల. "ఛీ! ఏం మనిషి వయ్యా! ఆ చెత్తలో బూడిదలో వుంచిన గరిటనే గిన్నెలో కలుపుతున్నావా?"

"పని తొందరై పోయి....మరచి పోయానండి. తుడుస్తున్నాను." ఎన్నడూ లేనిది పర్యవేక్షణకు వంటగదికే వచ్చిన యజమానురాలిని చూచి కంగారుపడి పోయాడు ఆచారి. ఎప్పుడైనా అయ్యగారే అన్నంలో వచ్చిన బొగ్గుచూసి, కట్టె పుల్లలు చూచి తనమీద ఎగిరిపడేవాడుగాని ఈమెగాని పన్నెత్తి ఒక్కమాట అనేది కాదు. బయటినుండి వచ్చిన చుట్టంలా తిని గదిలోకి వెళ్ళిపోయేది. వంటగదిముందుకు వచ్చి తమమీద పర్యవేక్షణ సలిపే వాళ్ళంటే చాలా ఇబ్బంది వంటవాళ్ళకు!

"చేతిక్రింద గుడ్డ అది? తలుకుగుడ్డ నయం. అది పెట్టి గరిట తుడుస్తున్నావా?....ఛీ ఛీ! నీ పని ఏకీ శుభ్రం లేదయ్యా. ఇలా వంటగది లేకావంటే నిన్ను మానిపించాల్సి వస్తుంది. అతడి నుండి మరేమీ సంజాయిషీ ఆశించకుండా విసురుగా వెనుదిరిగింది.

తల చిక్కులు వేళ్ళతో విడదీసుకుంటూ హాల్లో సోఫాలో కూర్చున్న కోమల చుట్టూ సంతృప్తిగా చూచుకోసాగింది. "ఆ గోడకు అక్కడ ఆ చిత్రం బాగుంది....ఎప్పుడు కొన్నాడో ఆయన చాలా చక్కని చిత్రం. అన్ని చిత్రాలూ అతడి కళాభిరుచిని తెలియజేస్తున్నాయి. వాటిని తగిన విధంగా వాటిని అలంకరించక వాటి అందం తగ్గిపోయింది....ఏదో తొందర తొందరగా సర్దినా ఎంత అందం వచ్చేసింది హాలుకు!"

తన ఇల్లూ, తన వస్తువులూ అనుకుంటే మనిషికెంత సంతృప్తి! ముఖ్యంగా స్త్రీకి!

"నమస్తే!"

అతిథుల్ని ఆహ్వానించి సోఫాలో కూర్చోజేసింది కోమల.

"ఇతడు న్యాయ— ఆఫీసరు మోహన్. భార్య నర్మద."

నర్మదకు మగవాళ్ళ ఎదుట అక్కడ వుండడం సంకోచంగా వుంది. లోపలికి తీసుకువెడితే ఇద్దరాడవాళ్ళూ సంకోచం లేకుండా మాట్లాడుకోవచ్చునని ఉబలాట పడిందిగాని కోమల అటువంటి ప్రయత్నమేదీ చెయ్యలేదు. అసలు, మోహన్ ఎదుట తనకేమీ సంకోచం లేనట్టుగా కూర్చొంది.

"ఎన్నాళ్ళనుండో అనుకుంటున్నాను, మీ దగ్గరికి రావాలని! మీ పరిచయం చేసుకోవాలని, ఇవాళ పడింది." చిరునవ్వుతో అంది నర్మద.

మగవాళ్ళిద్దరూ వాళ్ళ కబుర్లలో పడ్డారు. ఇల్లు చూద్దామంటూ నర్మదే లేచింది. పక్క గదిలోకి వచ్చాక అక్కడే కుర్చీలో కూలబడిపోయి, "మీరు చాలా అదృష్టవంతులు. పెళ్ళయ్యాక చదువుకునే అవకాశం ఎందరికి కలుగుతుంది ఇలా? మీ వారు చాలా ఆదర్శ యువకులనుకుంటాను. నా పెళ్ళయ్యేప్పటికి బి. ఎ. చదివాను. తరువాత ఎమ్. ఎ. పూర్తి చేస్తానంటే మా వారు ఎంత మాత్రం ఒప్పుకోలేదు. మరీ బలవంత పెడితే ఒప్పుకునేవారేమోగాని, వారి మనసు నొప్పించి నేను చదివి చేసేదేముంది? నా బ్రతుక్కింతే ప్రాప్తమని సరిపెట్టుకున్నాను" అంది నర్మద.

అక్కడికే ఫలహారం, టీ తెప్పించింది కోమల. హాల్లో మగవాళ్ళకు భీమాచార్లు అందించాడు.

నర్మద మరో గంటసేపు కూర్చొన్నా, ఆమె మాట్లాడిందే ఎక్కువ. రెండేళ్ళ వైవాహిక జీవితంలో అనురాగ దాంపత్య సౌఖ్యం చూచిన నర్మద మాటలు కోమలకు పూర్తిగా అనుభవ రహితాలు. అందుకే చాలా మౌనంగా ఉండిపోయింది.

గంట తరువాత సెలవు తీసుకుంటూ — "వీలు చేసుకుని ఒకసారి రండి" అంది నర్మద.

"తీరిక దొరకదు నాకు. పరీక్షలు వస్తున్నాయా? ఎప్పుడూ చదువుగొడవే. అందులోనూ నా కంతగా తిరగాలని వుండదు."

కోమల అలా అనవలసింది కాదనుకున్నాడు రామగోపాల్. "అవిడో పుస్తకాల పురుగు. సోషల్‌గా వుండే తత్వం కాదు ఆమెది" అన్నాడు కోమలకేసి చురుగ్గా చూచి.

"అదంతా పనిలేనివాళ్ళ పని!"

అప్పటికే ముఖంలో రంగులు తిరిగిపోయిన నర్మద కలవంగా నవ్వేస్తూ "నిజమే. మాకేం పని? మీలా ఓ చదువా? ఉద్యోగమా!" అంది.

దంపతులను సాగనంపి చీకటి పడ్డాక వచ్చిన రామగోపాల్ "అలా అన్నావేం! ఆమేమనుకుందో!" అన్నాడు మందలింపుగా.

"ఉన్నమాటే అన్నాను. ముఖప్రియాలు నాకు తెలియవు."

"ముఖప్రియాలు తెలియకపోతే పీడాపాయె. మర్యాదలు కూడా తెలియకపోతే పెద్ద చిక్కే."

"మీ దగ్గర నేర్చుకోవాలి కాబోలు."

మరునాడు ఉదయం టీ తీసుకుంటున్న సమయంలో నిన్నటిదంతా మరిచిపోయినట్టు, ప్రసన్నత ఉట్టిపడుతూన్న కంఠంతో అన్నాడు "యిల్లు సర్దడంలో నీకు చాలా నేర్పుంది. అక్కడా అద్దం తగిలించడం, ఇక్కడీ చిత్రం తగిలించడం చాలా అందాన్నిస్తున్నాయి. నిన్న నీకు చెప్పి వెళ్లానే గాని, వాళ్ళు వచ్చేప్పటికి ఏర్పాట్లు చేస్తావో లేదోనని నా గుండెలు పీచుపీచుమంటూనే వున్నాయి."

"మీ మాటమీది భక్తికొద్దీ నేనేం చేయలేదు. చేయాలనిపించి చేశాను. తమరేం మెచ్చుకోనక్కరలేదు." టేబులు మీద గ్లాసు కొంచెం చప్పుడుతో ఉంచేసి వడివడిగా వెళ్ళిపోయింది కోమల.

"ఇదెక్కడో చండిక. నా పూర్వజన్మ సుకృతంకొద్దీ దొరికింది" నవ్వుకున్నాడు. కోమల తన దగ్గరికి వచ్చాకైనా అవిడలో మార్పు చూడగలుగుతానేమో అనుకున్న రామగోపాల్, ఆమె మరింకా పెంకెతనం చూపడంతో బాధను విరక్తిగా మార్చుకోవడం నేర్చుకుంటున్నాడు.

నిజంగా నిన్నటి అనుభూతి కొత్తది కోమలకు. మనసును ప్రశాంతమయం చేసిందది. కాని, ఒకనాడు భర్త అహం

కార ధోరణి చూచి తను వసంతం వల్ల, ఆ ఇంటికి ఇల్లాలి ననిపించుకోడానికి చిన్నతనంగా భావిస్తూంది.

● ● ●

"కోమ లపరీక్షలైపోయాయి ఎప్పుడూ పుస్తకాలతో కుస్తీ పట్టే కోమలనే చూశాం. ఆమె తీరికగా ఏం చేస్తూందో చూడా లిప్పుడు. ఆమెను ప్రసన్నురాలిని చేసుకోవాలిప్పుడే. ఉత్సాహం కాంపు నుండి తిరిగి వచ్చిన రామగోపాల్ లేవ లేవి విశాఖలో దిగవడి పోవాల్సి వచ్చింది.

"రాత్రి ట్రెయిన్‌కు వెళుతున్నాను మా ఊరికి" సూట్‌కేస్‌లో సరదమంతా అయిపోయి తాళం వేసేస్తూ అంది కోమల.

"రెండు రోజులు రెస్టు తీసుకోరాదా! పరీక్షల గొడవలో చాలా అలసిపోయావు." చాపు నవ్వు తెచ్చుకుని అన్నాడు రామగోపాల్.

"ఉహుం. రాత్రికి వెళతాను ఫలానా ట్రెయిన్‌కు వచ్చేస్తున్నానంటు నాన్నకు ఉత్తరం వ్రాశాను కూడా." సబ్బుపెట్టె. టవలూ తీసుకుని వెళ్ళిపోయింది.

"సిక్కీ యిల్లు హాస్టలో, భోజన వసతి గల హోటలు దూనో తప్ప మరేమీ అనిపించలేదా, కోమలా?" కోమల పెంకెతనం చూస్తుంటే కోపం వస్తూంది రామగోపాల్‌కు. ఆమె ప్రవర్తనవల్ల మనసు బాధామయమౌతుంది. అయితే, తన ఆవేదన బయటపడకుండా, ఆమె నడవడి సరదాగా తీసుకుంటున్నట్టుగా, బెట్టుగా ప్రవర్తిస్తున్నాడు. "నష్టపడిపోతున్నది నేనొక్కడినేకాదని నువ్వు గుర్తించేరోజు వస్తుంది, కోమలా!" అనుకున్నాడు కసిగా

ట్రెయిన్ మరికొద్దిసేపటికి కదలబోతుందనగా సెలవు తీసుకోబోతూ ఆర్ద్రతగా అడిగాడు రామగోపాల్ "ఇక్కడికివచ్చి నువ్వేమీ యిబ్బంది పడలేదనుకుంటాను."

"ఉహుం. చాలా జాగ్రత్తగా నడుచుకున్నారు, నా గుణం తెలిసి, పొరపడిననే దురహంకారంతో దుడుకుగా ప్రవర్తించి ఉంటే చాలా చెడ్డ ఫలితాన్నే చవిచూచేవారు" సగర్వమైన హాసరేఖ ఆమె పెదవులమీద నర్తించింది.

ఒక్కక్షణం పౌరుషం పడగవిప్పింది అతడి అంతరంగంలో, తన నిదానాన్నీ, సహృదయతనూ ఆవిడ పంతంముందు పీగిపోయిన అసమర్థతగా వెల్లడించడంతో. కాని తమాయించుకున్నాడు నిండా విషం నింపుకుని. పడగెక్కిన కోడెనాగు ఆమె! ఒడుపుగా పట్టి కోరలు పీకి బుట్టలో బంధించగల సామర్థ్యం తనలో వుంది. కాని, బుట్టలోనినాగు పుట్టలోని నాగుదర్పాన్నీ, స్వేచ్ఛనూ కోల్పోయి జీవచ్ఛవమైపోతుంది. ఆ పొంకమూ, పొగరూ ఏవీ ఉండవు. అలాంటి మనిషితో కాపురం హృదయమున్న మానవుడెవడూ ఆశించడు!



"బలాత్కారంగా ఏ పువ్వునుండీ సౌరభాన్ని అందించడం తెలివిహీనత!" కదిలిపోతున్న రైలు వంక చూస్తూ నైరాశ్యంలో మునిగిపోయాడు. "కోమల మనస్ఫూర్తిగా నాకు అంకితం కాకపోతే ఆమె నుండి విడిపోవడమే నేను కోరుకుంటాను!"

● ● ●

ముఖం కడుక్కోడానికి బాత్‌రూంకేసి వెడుతూ, పెరటి దగ్గర మగడి టెరిలీన్ గుడ్డలు సబ్బుపెట్టి ఉతుకుతూన్న చెల్లెలిని ఏహ్యంగా చూచింది కోమల. "దీనికి సిగ్గూ, అభిమానం లేవు. కాకపోతే మగడికి ఇంతగా చాకిరీ చేయడమేమిటి! ఛీ! అతగాడు. ఏం మగాడు! భార్య సంతలోకొన్న బానిసా! ఏంత చదువుకొంటేనేం ఎంత పెద్ద ఉద్యోగంచేస్తేనేం! ప్రతి మగాడొక కుసంస్కారాలపుట్ట."

ముఖం కడుక్కొని వస్తూంది కోమల: బాగా మైల పోయిందా! మరోసారి సబ్బు పెట్టనా!"

"ఇంకెందుకు! బాగా ఉతికావు."

మగడి మెచ్చుకోలును సంతృప్తిగా స్వీకరిస్తూ చిరునవ్వు చిందిస్తూన్న చెల్లెలిని చూచి "ఛీ! ఏం ఆడది!" ఛీత్కారంగా అనుకుంది కోమల. "ఇలాంటి వాళ్ళిచ్చే అలుసు చూచే మగవాళ్ళలా గద్దెనెక్కి పరిచర్యలు చేయించుకుంటారు!"

అంతగా ఏవగించుకున్న కోమల సాయంత్రం సీమంతం పీటలమీద కూర్చొన్న చెల్లెల్ని చూచి. అదే అదృష్టంగా భావించి ఈర్ష్యకు లోనైపోయిం దెందుకో!

విద్యా విజ్ఞానాలను ఎంతగా వికసింప జేసుకున్నా, నాగరికతా మోజుల్ని ఎంతగా పెంచుకున్నా సహజ స్వభావాన్ని అధిగమించలేదు స్త్రీ. ఏదురదృష్టక్షణంలోనో లొంగిపోకతప్పదు!

"పెళ్ళయ్యి ఆరుమాసాలైనా కాలేదు. అప్పుడే దీనికి అయిదోనెల!" వింతగా చూచింది పీటలమీద కూర్చొన్న చెల్లెలిని, కోమల.

అయిదోనెల పడిందని సీమంతానికి పుట్టింటికి తీసుకువచ్చారు లలితను. కోమల వచ్చాకే మగడితో వచ్చిందామె మొన్న.

"ఎంత మారిపోయింది లల్లి! తనకంటే తెలివైంది. తనకంటే చదువులో ఆసక్తి ఎక్కువ. ఒట్టి పుస్తకాల పురుగు అనిపించుకుంది. పెళ్ళిసంబధాలు చూస్తుంటే తనైనా దెబ్బలాడిందిగాని అది సులభంగా పెళ్ళికి ఒప్పుకుంది రామారావుతో. ఇప్పుడది పక్కా సంసారి అనిపించుకుంది. పెళ్ళయ్యాక కనీసం ఓ వీక్లీ కూడా దాని చేతిలో చూడలేదు. ఎంత చిత్రం?

తల్లి పెట్టిన నూతన వస్త్రాలు ధరించి పీటలమీదికి వచ్చింది లలిత. మాతృత్వం పొందబోతున్న ఆమె శరీర అవయవాలు పరిపూర్ణత నింపుకుని కొత్త అందాన్ని కురిపిస్తున్నాయి. పేరంటాళ్ళమధ్య చిరుసిగ్గుతో, ఇంచుక గర్వభావంతో, కొత్త కళతో మెరిసిపోతున్న లలితను చూస్తుంటే ఏదో తపనకూ, ఎన్నడూ తెలియని ఆవేదనకూ లోనైంది కోమల అంతరంగం.

పెద్ద వదిన లలిత ఒడిలో పళ్ళూ, ఫలహారాలూ నింపుతూ కోమలను పరాచికమాడింది. "నీదే ఆలస్యమైపోయిందమ్మో. మరదలా! లలితను చూచి అయినా తొందరపడు."

మరోసారి అయితే ఏహ్యభావాన్ని ప్రకటించేదేమోగాని ఈసారి మౌనంగా ఉండిపోయింది కోమల. "మగడిని చూస్తే మైమరుపులో మునిగిపోయే లలిత ఇప్పుడు

తల్లి అవబోతూంది! దాం పత్యం. మాతృత్వం స్త్రీ జీవితానికి తీరంటి, అనుభవాలు! తొలిసారిగా కొత్త ఊహ వచ్చింది. "చదువంటూ. స్త్రీ ఉన్నతి అంటూ భ్రమ పడి జీవితం నిరర్థకం చేసుకుంటున్నానా?" ఎందుకో మధనపడింది. "కాదు. ఈ అనుభూతి అనుభవాలకు విజ్ఞానం కూడా తోడు కావడం జీవితం కేవలం అందమైన పువ్వుగా మిగిలిపోక సౌరభ భరితమూ అవుతుంది?"

● ● ●

కాలేజీ తెరిచారు.

భర్త దగ్గరికి ప్రయాణమైంది కోమల. అక్కడ దింపుకోడానికి ఆయన వస్తాడు లెమ్మని తనతో ఎవ్వరినీ రానివ్వలేదు ఆమె.

రైలు ఆగుతూనే కుతూహలంగా కిటికీ దగ్గరికి వచ్చి తొంగిచూచిన కోమలవదనం పాలిపోయింది. దూరంగా ప్యూన్ మల్లన్న వెదుకుతూ వస్తున్నాడు. "తీరి లేదేమో! ఇదివరకెప్పుడూ ఆయనే వచ్చేవారు!"

ఇదివరకూ అతడిరాక కోమలకు ఉత్సాహాన్నే రేకెత్తించేది. అయితే అది, తన పెంకెదనంతో అతడిని నిరుత్సాహపరిచి సంతృప్తి పడడానికి. కాని. ఇప్పుడు ఏదో పశ్చాత్తాపం, మార్పు వస్తున్నాయి ఆమెలో.

"శారీరకంగా బలవంతుడు, సృష్టికి బీజదాత అయిన పురుషుడు ఆదినుండి అహంకారే. అయితే, దాన్ని పెకసర బుద్ధితో, ప్రతీకారేచ్ఛతో ఎదుర్కొనడం కాదు. అతడి సాసాచర్యంలో సస్నేహలతను పెంపొందించడంలోనే వుంది స్త్రీ ఔన్నత్యం!"

ఇంటిదగ్గరకూడా తనకోసం నిరీక్షిస్తూ రామగోపాల్. కనిపించక పోయేసరికి ఏమిటో నీరసం ఆవహించింది కోమలను.

* * *

దినచర్య విసుగ్గా తయారైంది కోమలకు. చదువులో ఆసక్తి ఎప్పుడో తగ్గిపోయింది, మనస్సంతా ఏమిటో అలజడీ, దిగులూ నిండిపోయాయి. "ఏం సాధించాలనుకుంది? ఏం సాధించింది?" ఇదే ప్రశ్న వేధిస్తూంది ఆమెను. బాగా చదువుకోవాలని, సమాజంలో ఉన్నతస్థాయి, గౌరవం సంపాదించుకోవాలని. అప్పుడు భర్త తన ప్రేమకోసం ప్రదక్షిణాలు చేస్తుంటే బంగారు వజ్రం సామెత చెప్పి పరిహసించాలని? అతడి పురుషాహంకారంమీద దెబ్బతీయాలని. యిలా ఆవిడకన్న కలలన్నిటినీ భర్త వింత ధోరణి పరిహసిస్తూంది.

ఎప్పుడో వెనుకటికొకసారి ఇల్లు చక్కదిద్దుకోవడం చూచి ఎంతగానో మెచ్చుకొన్న అతడు ఇప్పుడెంతో శ్రద్దగా, అందంగా ఇల్లు సర్దినా చూచీ చూడకుండా పోతాడు. ఇంటికి అతడు రావడమే అరుదు. వస్తే ఇంట్లో ఎవరో తరుముతున్నారన్నట్టుగా వేగంగా బయటపడతాడు.

"అయ్యగారు ఇంట్లో వుండడమే తక్కువైంది. బయట ఏంపని అంతగా?" పరాయివాళ్ళను అడగకూడదని ప్రశ్నే అయినా ఆత్రుత పట్టలేక అడిగేసిందో సారి, మల్లన్నను.

"అయ్యగారికి బయట స్నేహితులు తక్కువా, అమ్మా? ఎప్పుడూ అయ్యగారిని వదలరు. మీరెప్పుడూ చదువు గొడవలో మునిగివుంటారాయె. అయ్యగారికి ఏం తోస్తుంది?"

"ఊహూఁ?"

"చెప్పకూడదుగాని...." వెకిలి నవ్వు నవ్వుతూ నసిగాడు వాడు,

"ఏమిటి చెప్పు." వేట దొరికిన కప్పలా ఎగిరిందామె మనసు.

"రామదాసు అయ్యగారి దోస్తు అట. అయ్యగారి ఆఫీసులోనే పని చేస్తుంటాడు. చాలాసార్లు ఆయన ఇంటిలోనే వుంటాడు మనబాబు. ఆయనగారి పెళ్ళాం చాలా అందంగా వుంటుందిలెండి. రామారావు ప్రమోషన్‌కు ఆశపడి ఇద్దరికీ జత కలిపాడని అనుకుంటాము మా ఆఫీసులో." విషతుల్యమైన సంగతి అమ్మగారి చెవిలో వేశాక ఇక ఆమె ముఖంలోకి చూడడం కష్టమనుకున్నాడేమో అక్కడనుండి జారుకున్నాడు మల్లన్న,

కోమల హృదయం తీరని దుఃఖంతో నిండిపోయింది. ఎవరిముందైనా ఆ భారం దింపుకోవాలని ఉంది. చెప్పుకోడానికైనా ఎవరున్నారు. తనకు దిక్కు? కాలేజీలోనూ, ఇంటిదగ్గరా ఎవరితోటీ స్నేహం పెంచుకునే అవసరంకనిపించలేదిదివరకు. నర్మద పరిచయం తరువాత భర్త కూడా మళ్ళీ ఎవరినీ ఇంటికి తీసుకురాలేదు.

● ● ●

"రండి, రండి." స్నేహపూర్వకంగా ఆహ్వానించి కూర్చోబెట్టింది నర్మద. "చాలా రోజులకు తీరుబాటు చేసుకొన్నారు?"

"ఏమిటో బోర్‌గా వుంది."

"వస్తున్నాయి కదా, పరీక్షలు. చదివి చదివి విసిగెత్తిపోయి వుంటుంది. నేను చదువుతున్న కాలంలో కూడా చదవడం అలా వుంచి భయంతో బెంగతో సగం అలసిపోయేదాన్ని" అంది నర్మద నవ్వేస్తూ.

"ఊహుఁ. అలాంటిభయం నాకెప్పుడూ లేదు. బాగా చదివే వాళ్ళకు పరీక్షలముందు భయం ఉండదు. ఇహ పరీక్ష ఎలా పోయినా సరే అనుకునేవాళ్ళకూ భయంవుండదు."

నర్మద ఆశ్చర్యపోయింది, కోమలలోని నిర్వేదం చూచి. "ఏమిటో. మీరు చాలా మారిపోయారు అప్పటికీ, ఇప్పటికీ."

"ఉఁ. మార్పులేని మనిషెక్కడ?"

"ఏం జరిగింది?" స్నేహార్ద్రంగా కోమల భుజం తట్టింది.

మనసులోని భావాన్ని దించుకోడానికి ఎవరినో ఒకరిని దగ్గర జేర్చుకోవడం తప్పడంలేదు. "మీరు చాలా బుద్ధిమంతులు. మీ వారికిష్టంలేదని చదువుమీదఆస క్తివదులుకునిసంసారంలో పడిపోయి చాలా తెలివైన పనిచేశారు. ఎప్పుడైనా బాగా చదువుకున్న వాళ్ళను చూచినప్పుడు అనిపించవచ్చు-నేనలా చదువుకోలేకపోయానే అని. కాని, అదేమంత కష్టంకాదు, మీ రాజీ పద్ధతి ననుసరించకుండా నేను కోల్పోయిన ఆనందముందు." విషాదంగా నవ్వి అంది తిరిగి "అహంభావమో, ఆధునిక నాగరికత స్త్రీకి తెచ్చిన జాడ్యమో చెప్పలేనుగాని నాకు మగవాళ్ళంటే మొదటినుండీ తిరస్కారం, కోపం ఎక్కువ. స్త్రీ పురుషుడికి బానిసగా మారుతూన్నదంటే

ముఖ్యంగా ఆ విద్యే కారణమ: , బాగా చదివి ఏ మగవాడికీ తీసిపోకుం: హోదా గల ఉద్యోగంలో చేరాలని, ప్రణయ భిక్షకోసం మగవాళ్ళను దీపం చు్టు పురుగుల్లా తిప్పించుకోవాలని - ఇలాం విపరీత విప్లవ భావాలు చెలరేగుతున్న స యంలో బలవంతంగా మా వాళ్ళు పెళ్ళిచే: వేశారు. అనుభవ రహితాలైన భావాలు ఎప్పటికైనా అనర్థకాలేనేమో! అప్పటి విప్లవ భావాలకు బలి అయిపోయాయి ఆయన సౌఖ్యం; నా జీవితం."

కోమలలోని ఆరాటం, ప త్తాపం అన్నీ అర్థమయ్యాయి నర్మదకు. కోమల మనస్థితి తను అర్థం చేసుకోగలదు. పోతే, యిప్పుడు రామగోపాల్ ఉన్న పరిస్థితి కూడా తనకు తెలుసు. పక్కయి రామారావుది. అతకి భార్య ఎంత అపూర్వ సుందరో అంతగా చెడిపోయిం . బుద్ధిమంతుడైన రామగోపాల్ కూ దాని ప్రలోభంలో పడిపోయాడు. ప్రణయ సామ్రాజ్యలేలే ఆవిడం ఈవీధికంతా అపహ్యం.

"వెధవ చదువు ఏట్లోకి విసిరి ముందు నీ మగణ్ణి చక్కదిద్దుకో." కోమ దగ్గరికి పరిగెత్తి చెప్పాలని ఎన్నోసార్లు ఉబలాట పడింది తను. కాని ఆవిడ పెంకెతనం, గర్వం గుర్తుకు వచ్చి, తనలా ంగట్టుకు వెళ్ళి అవమానం పొందడమే అ తుందని మానుకుంది.

"ఆయనముందు విరసంగా, నిర్లక్ష్యంగా, తిరస్కారంగా ప్రవర్తించిన మాట నిజమే. అడుగడుగున అతడి అభిమానంమీద దెబ్బ తీయాల ప్రయత్నించాను కూడా. నా కప్పుడు సంసారం మీద వ్యామోహంలేదు. జంటగా కలిసి ఉండడంలో అవసరం, అర్థం నిపించ లేదు. మగవాడంటే మోజులేదు.

"పగలంతా మొగ్గగా ఉండి స ధ్యవేళ విచ్చుకునే మల్లెమొగ్గలా సమ మంతా గడిచిపోయాక నా మనసులోని విచ్చుకుంది. ఇప్పుడు చెప్పండి ఉ ాయం. రాత్రి చీకటిలో పిచ్చి పరిమళాలు వెదజల్లి వెర్రిగా ఉదయం నేలరాలిపోయే పువ్వులా కాకుండా నా జీవితం సార్థక్యం సుకునే ఉపాయం చెప్పండి. యిల్లాలుగా అను భవమంతా వినియోగించి నన్ను రక్షించండి." దుఃఖంతో, ఆవేశంతో నర్మద చేతులు ప కుంది అర్థిస్తూ.

"నీలో మార్పు వచ్చాక మీ వారిని నీ వైపు ప్పుకోడానికి నువ్వు ఏ విధంగా ప్రయత్నం చేశావు, కోమలా!" మృదువుగా కోమల భుజం తడుతూ స్నేహార్ధంగా అడిగింది నర్మద.

"ఉహూ. నేనై నేనుగా ఆయన్ని తట్టాలంటే ఏమిటో సిగ్గుగా ఉంది." కన్నీటితో తలాడించింది.

"ఇంకా పొరపాటు చేస్తూనే ఉన్నావు. పిచ్చిదాని కాకపోతే, పచ్చగా కలకలలాడాల్సిన జీవితం నట్టేట కూలిపోతుంటే ఇంకా అభిమానమా? సంసారం నిలబడాలంటే ముందు రాజీ పడాల్సింది స్త్రీ. ఎందుకంటే, సంసారం పాడుకావడంవల్ల ఎక్కువగా నష్టపడేది ఆడది కాబట్టి. తప్పు జరిగింది కూడా నీ వల్లే నాయె.

"మీ మధ్య ఏమీ జరుగనట్టుగా, కలసి మెలసి అన్యోన్యంగా మసలినట్టుగా చనువుగా, మ దువుగా ప్రవర్తించి చూడు. అతడు చెడిపోయాడని గాని, నువ్వు పొరపాటు చేశావనిగాని అలాంటి భావమేదీ ముందుకు రానీకు. ఎంత చెడిపోయినా అతడు సౌమ్యుడు. మంచివాడు. నీ సంసారం బాగుపడగలదనే నా ఆకాంక్ష, ఆశీస్సు."



తొట్టెలో ఆడుకుంటున్న నర్మద కొడుకును ఎత్తుకొని ముద్దులాడుతూ "ఎన్నో నెల? ఏం పేరు పెట్టారు?" ఉత్సాహం ముఖంమీద పులుముకుని అడిగింది కోమల.

చెప్పి, కోమల చేతులనుండి బాబును అందుకుంటా, "నాకో బుల్లి పెళ్ళాన్ని వ్వత్తా - అని అడగరా బుజ్జీ!" అంది నవ్వేస్తూ నర్మద.

"అగ్గో! అప్పుడే అత్తగారి పదవి అందుకోవాలని సరదా పడుతున్నారు!"

కోమల సెలవు తీసుకోబోయేముందు నవ్వుతూ అంది నర్మద" ఆమెను చూస్తావా? పెరటి గోడ దగ్గిరికి వెడితే కనబడొచ్చు!"

చూడాలని కోరికగా వున్నా, ఆవిడ సౌందర్యం తనను దుస్సహమన్నట్టు అడ్డంగా తలాడించింది కోమల. "ఛీ ఛీ! ఏం చూడాలి అలాంటి దాన్ని?"

"అంతే. అవసర మేముంది?"

● □ ●

ఆఫీసునుండి వస్తూనే, ముఖం కడుక్కొని, నీటుగా దుస్తులు వేసుకొని ఎక్కడికో ప్రయాణ సన్నాహం చేస్తున్నాడు రామగోపాల్. "భీమాచారీ! టీ!"

ఓ చేత ఫలహారం ప్లేటు, మరోచేత నీళ్ళగ్లాసూ పట్టుకొని వచ్చింది, అందంగా అలంకరించుకొన్న కోమల. టేబిల్ మీద వుంచుతూ "పిక్చర్‌కు రెండు టికెట్లు బుక్ చేయించాను అంది చాలా సహజంగా, చిరునవ్వు పలుచనిపెదాలపై నర్తిస్తూంటే.

వింతగా ఆడాయి కనుబొమలు. విడ్డూరంగా చూశాడు. "ఎవరికి?"

మనిద్దరికి." చూపులు కలుపలేక నేల వాల్చింది.

అతడూ తనలోని భావాలన్నీ అణచివేసుకొని మామూలుగా ఉండడానికి ప్రయత్నించాడు. ఉహుఁ." వీలుపడదు" అన్నాడు నెమ్మదిగా, ప్లేటు ముందుకు జరుపుకొంటూ.

"ఎందుకూ!" అకోసుకుండా రోషం తొంగిచూచింది.

అతడూ ఒకక్షణం కోపంగా చూశాడు. కాని వెంటనే తమాయించుకొన్నాడు. "నాకు వేరే పని వుంది.

"ఈ ఒక్కరోజు కోసం...."

"అవును. మనసుకు అయిష్టంగా వున్నప్పుడు ఒక్కరోజుకేం, ఒక్క నిమిషానికికూడా ఆగడం జరగదు."

"అంటే?" స్వరం కంపించింది.

"వెనుకటిదంతా కెలికి నిన్ను బాధించే వుద్దేశ్యంలేదు నాకు. నాలో ఏ కొద్ది కాఠిన్యమున్నా మన రెండు జీవితాలు రెండు దారులు పట్టేవికావు." నిర్లిప్తంగా ఫలహారం పూర్తి చేశాడు రామగోపాల్. కాఫీ మెల్లమెల్లగా చప్పరిస్తూ గుమ్మానికి ఆనుకు నిల్చొని తిరిగి అన్నాడు: నిన్న మొన్నటి దాకా నీ మీద ఆశలు పెంచుకున్నాను. నీలో మార్పు రాకపోతుందాని ఆశించాను. నా దీర్ఘ నిరీక్షణా ఫలితం మిగిలిందినిరాశ. విషం నిండిన నాగు రాతికీ రప్పకూ కాటు

వేసి బరువు దింపుకొన్నట్టుగా ప్రతీసారీ నన్ను కాటువేసి తేలికపడ్డావు, కోమలా! అందుకే నిన్ను కలుపుకొని సాగడ కాక విడిపోయి సాగిపోవడమే నా హృదయానికి స్వాంతనగా ఎంచి నా మార్గం నేను ఎన్నుకొన్నాను. అయితేనీమీదనాకేం కోపం లేదు. నీకోరిక నీవు నెగ్గించుకున్నావు. అందువల్ల నా జీవితం నాశనమైంది.నిజమే. అయితే, బాధలేదు. బలిమిని పొంది వాడికంటే మనస్ఫూర్తిగా పోగొట్టుకున్న వాడికే సంతృప్తి ఎక్కువ." శాంతంగా, గంభీరంగా సాగిపోతున్న అతడి వాగ్ధోరణిలో హృదయాన్ని తీవ్రంగా కలచివేసే విషాదం. ఆర్ద్రతకూడా లేకపోలేదు.

దుఃఖోద్విగ్నత ఆపుకోలేక గదిలోకి దూసుకుపోయింది కోమల.

రామగోపాల్ స్కూటర్ స్టార్టు చేయబోతుంటే కంగారుగా పరిగెత్తుకువచ్చాడు మల్లన్న. "అమ్మగారు ఏడుస్తూంది, బాబూ!"

స్కూటర్ ఆపుచేసి ఇంట్లోకి వచ్చాడు రామగోపాల్.

మంచంమీద పడిపోయి వెక్కి వెక్కి ఏడుస్తూంది కోమల.

"ఎందుకుచెప్పు." దిండుకు ఒత్తేస్తున్న ఆమె ముఖాన్ని పైకి లేవదీస్తూ నెమ్మదిగా అనునయించ సాగాడు. చాలాసేపటిగ్గాని ఎగసిపడే ఆమె వక్షం స్థిమితపడలేదు.

"తప్పుచేశాను. కాదనను. కాని, ఈ మధ్య నాలో కలిగిన మార్పునూ, తప్పు దిద్దుకొనే నా ప్రయత్నాన్నీ, నన్ను కాల్చివేస్తూన్న పశ్చాత్తాపాన్నీ మీరు గ్రహించలేదా!" దైన్యంగా అడిగింది.

"గ్రహించాను." దీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు: "అయితే ఏం లాభం? సమయం మించిపోయింది. నేను పూర్తిగ గతి తప్పాను, కోమలా! నీలో నేనాశించిన సౌఖ్యం లభ్యం కాకపోవడంతో పక్కదారులుపట్టి పాడైపోయాను. మెదట ఎందరో. ఇప్పుడు మాత్రం ఒక్కరే. రాధ. ఆమె భర్తకు కుదరని రోగం. అదింకా ప్రారంభంలో వుంది కాబట్టి, అతడి జీతంలో సగం మందులకు పోస్తాడు కాబట్టి అదింకా నలుగురి కళ్ళలో పడేదాకా రాలేదు. అతడు అమితంగా ప్రేమించి పెళ్ళి చేసుకున్న రాధను అందుకే తాకడు. ఆమె ఇష్టపడినవాడితో ఆమె జీవితాన్ని ముడిపెట్టి తను దూరంగా తప్పుకోవాలని అతడి వాంఛ. అందుకే నన్ను రాధకు దగ్గరజేశాడు. ఎలాగా మనదారులు వేరయ్యాయి కాబట్టి,రాధను వివాహం చేసుకుని నా జీవనయాత్రకు తోడుగా నిల్పుకుందామని నిశ్చయించుకొన్నాను."

"అదెంత మాత్రం వీల్లేదు." ఆవేశంగా కేక పెట్టింది. "నేనొప్పుకోను. నాక్కావల సింది మీరు. మీ రెవరివారో కావడం నే భరించలేను." మళ్ళీ రోదించ సాగింది.

విషాదంగా మందహాసంచేసి అన్నాడు: "ఏం చేసుకుంటావ్. పూర్తిగా చెడిపోయినవాణ్ణి! నీ ఆదర్శాలు, ఆశయాలు ఈ నీచుణ్ణి అంగీకరింపనిస్తాయా!"

"ఉహుఁ. ఇతరలోహాల సంపర్కంతో నల్లబడొచ్చు బంగారం. కరిగించి, వాటి నుండి విడదీసి, మేలిమి బంగారం పొందవచ్చు. మీరు చెడిపోయింది నా అజ్ఞానం వల్లనే. నేనే బాగు చేసుకుంటాను, మిమ్మల్ని." దృఢంగా అంది. "ఎప్పుడో మీరు బంగారు, వజ్రం సామెత చెప్పారు అప్పుడు పురుషహంకారం పలికిన మాట అనుకున్నాను. కాని, అది ఏకాలమైనా స్త్రీకి శిరోధార్యం.

"జీవనధర్మంలో దాంపత్యం మీరరాని మధురఘట్టం. వనంలో విహరించే పక్షికి కూడా తన మగడూ, తన పిల్లలూ, తన గూడూ అంటే ఎంతో మక్కువ. అదే మక్కువ ప్రతి జీవిలోనూ వుంది. మనిషిలో అదింకా ఎక్కువ.

"నాక్కావాలిమీరు. మీ తోడి సంసారం కావాలి. మన ఆశల ప్రతిరూపాలుగా నిలిచే చిట్టిపాపలు కావాలి. ఈ కోరిక తీరనినాడు చదువుపోయి గంగలో కలువనీ అది నన్ను సుఖపెట్టదు."

"కాలగమనంలోని అనుభవంతో సానబట్టిన వజ్రంలా మెరుస్తూంది నీ లోని స్త్రీ. వైవాహిక జీవితంలో నే నాశించిన స్త్రీ యిదే." సంతృప్తిగా గుండెలకు అన్చుకున్నాడు ఆమెను. "ఏనాడూ నీ ఇష్టాన్ని కాదనలేదు. కాదనను. నీ కిష్టమైన విధంగా తీర్చిదిద్దుకో. ఈ ఇంటినీ, ఇంటిలోని మనుషుల్నీ."

"మరి, రాధ?" ఇదంతా నమ్మలేక పోతున్నట్టూ, కొంత ఈర్ష్యగానూ అడిగింది కోమల. "మీ రామెను ప్రేమించ లేదా?"

ప్రేమా? నా తొలిప్రేమ పల్లవించింది మన పెళ్ళి చూపులనాడు. నా హృదయదేవత కోమలాదేవి. రాధంటే - నీ వల్ల ఆశాభంగం పొంది పెంచుకున్న పిచ్చి సంబంధం. నువ్వొద్దంటే మరిచిపోతాను." మృదువుగా కోమల చెక్కిళ్ళు తడిమి మైకంగా అన్నాడు : "ఇహ ఈ కోమల తోడిదే నా లోకం."

"....—" కోమల మరో లోకంలో విహరిస్తూంది.

"ఇహ పిచ్చి ఆలోచనల్తో మనసుపాడు చేసుకోకు. పరీక్షలు నెత్తిమీది కొచ్చాయా? ఇంత చదివి వ్యర్థం చేయకు. బాగా చదువు. అందాకా ఈ దూరం యిలాగే వుంచు. నీ కోరికా తీరనీ, చదువుకున్న భార్య అన్న సంతృప్తి నాకూ ఉంటుంది." చిలిపిగా చెలియ చెక్కిలి మీటి, హుషారుగా షైరుకు బయల్దేరాడు రామగోపాల్.

□□□